నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్





సోమవారం 14 అక్టోబర్ 2024

MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




మంచిర్యాల అర్బన్ : శమీ వేడుకల్లో పాల్గొన్న మంచిర్యాల హిందూ ఉత్సవ సమితి సభ్యులు



తాండూరు : అచ్చలాపూర్‌లో రావణ దహనం



కాగజ్‌నగర్ : రావణ దహనం చేస్తున్న కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం



మందమర్రిలో రామ్‌లీలాను తిలకించేందుకు వచ్చిన ప్రజలు



శ్రీరాంపూర్ : ఆర్‌కే 6గనిపై శమీ (జమ్మి) పూజ చేస్తున్న జీఎం సంజీవరెడ్డి దంపతులు



బెల్లంపల్లి : రావణ వధ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

# వైభవంగా దసరా వేడుకలు

- భక్తిశ్రద్ధలతో శమీ పూజలు
- ఆకట్టుకున్న 'రామ్‌లీల'లు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- పలుచోట్ల పాల్గొన్న ప్రముఖులు
- వాహన, ఆయుధ పూజలు నిర్వహించిన పోలీసులు

నమస్తే బృందం : ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో శనివారం దసరా వేడుకలు అంబరాన్నంటాయి. ఊరూరా శమీపూజలు నిర్వహించగా, ఆయుధ, వాహనాల పూజలు, దర్శనాలతో ఆలయాలన్నీ సందడిగా మారాయి. రాత్రివేళ నిర్వహించిన 'రామ్‌లీల' కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్డులో నిర్వహించిన శమీ పూజల్లో ఎమ్మెల్యే పీఎస్సార్, కలెక్టర్ కుమార్ దీపక్ దంపతులు, డీసీపీ భాస్కర్, ఎమ్మెల్యే సతీమణి, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పాల్గొన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని బాలగంగాధర్ తిలక్‌స్టేడియంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ రామ్‌లీల కార్యక్రమాన్ని ప్రారంభించారు. మందమర్రిలోని సింగరేణి పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే వివేక్, సింగరేణి ఏరియా జీఎం దేవేందర్, అధికారులు, యూనియన్ నాయకులతో కలిసి రామ్‌లీల కార్యక్రమాన్ని ప్రారంభించారు. సింగరేణి గనులపై జీఎంల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ శ్రీనివాస్ ఆయుధ, వాహనాల పూజ నిర్వహించారు. గుడిపేట బెటాలియన్‌లో కమాండెంట్ వెంకట్రాములు దంపతులు రావణుని బొమ్మను దహనం చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌లో శనివారం కాగజ్‌నగర్ డీఎస్పీ రామనుజం, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు రావణ దహనం చేశారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఉన్నారు.



కాసిపేట : సోమగూడెంలో నృత్యం చేస్తున్న మహిళలు



మంచిర్యాల అర్బన్ : కమిషనరేట్‌లో ఆయుధ పూజ చేస్తున్న సీపీ శ్రీనివాస్



మంచిర్యాల అర్బన్ : జిల్లా కేంద్రంలో నిర్వహించిన శమీ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పీఎస్సార్, కలెక్టర్ కుమార్ సందీప్, డీసీపీ భాస్కర్



మందమర్రిలో మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



హాజీపూర్ : రావణ దహనం చేస్తున్న కమాండెంట్ దంపతులు

# కనుల పండువగా కల్యాణోత్సవం

**ప్రధాన వీధుల్లో వేంకటేశ్వరుని రథోత్సవం**

సిర్పూర్(టీ), అక్టోబర్ 13 : మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేంకటేశ్వరుని ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం వేద పండితులు స్వామి వారి రథానికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. భక్తులు వేలాదిగా తరలిరావడంతో ప్రధాన వీధులన్నీ కిక్కిరిశాయి. గోవింద నామస్మరణతో పట్టణం మార్మోగింది. డప్పు చప్పుళ్ల నడుమ ఒగ్గు డోలు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తుల సమక్షంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సిర్పూర్(టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌటల సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో సిర్పూర్(టీ) ఎస్ఐ కమలాకర్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలయంలో రథానికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ జడ్పీ పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. నాటి తీపి గుర్తులను నెమరేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సంగోజు సూర్య ప్రకాశ్, ఏటుకూరి శ్రీనివాసరావు, ఇందారపు ప్రకాశ్, గుల్లపల్లి రవిశంకర్, దెబ్బటి సత్యనారాయణ, గంగాభవాని, సునీత, పరికిపల్ల వెంకటరమణ, ఇమాదుద్దీన్‌ను సన్మానించారు. కోట్రంగి శేఖర్, అన్నరావు, తాజుద్దీన్, గుమ్మడి నవీన్, ప్రణీల్, శివాజీ, ప్రణోత్, దేవేందర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

- కాగజ్‌నగర్, అక్టోబర్ 13

# గూడెంలో ఇరువర్గాల దాడి

దండేపల్లి, అక్టోబర్13 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో దసరా పండుగ నాడు ఇరు వర్గాలు దాడి చేసుకున్నాయి. శనివారం సాయంత్రం జమ్మికి వెళ్లిన క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మాటా మాట పెరగడంతో ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు నివారించే ప్రయత్నం చేయగా, స్వల్పంగా తోపులాట జరిగినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా ఘటనపై విచారణ చేపడుతున్నామన్నారు.

# ఏఎంవీఐగా రెబ్బెన్‌పెల్లి యువకుడు

దండేపల్లి, అక్టోబర్13 : మండలంలోని రెబ్బెన్‌పెల్లి గ్రామానికి చెందిన కొట్టె మధూకర్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)గా ఎంపికయ్యాడు. కొట్టె తిరుపతి, పద్మ దంపతుల కుమారుడు మధూకర్ రెబ్బెన్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2015లో పదో తరగతి, ఆపై మంచిర్యాల ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమా (2015-18) పూర్తి చేశాడు. టీఎస్-ఈసెట్ (2018)లో రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని ఓయూలో సీటు సంపాదించాడు. 2018లో అసిస్టెంట్ లోకో పైలెట్‌గా అవకాశం వచ్చినా, బీటెక్ మెకానికల్ ఇంజినీర్(2018-21) పూర్తి చేయాలనే ఉద్దేశంతో దానిని వదిలేశాడు. 2023లో షార్ శ్రీహరికోట ఇస్రోలో టెక్నికల్ సైంటిస్ట్‌గా పనిచేశాడు. ఈ నెల 10న వెలువడిన టీఎస్‌పీఎస్ ఫలితాల్లో ఏఎంవీఐ-2024గా ఎంపికయ్యాడు. గ్రామస్తులు మధూకర్‌ను అభినందించారు.



కొట్టె మధుకర్

# గ్యారెంటీల పేరిట గారడి చేస్తున్నరు

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ**

కాగజ్‌నగర్, అక్టోబర్ 13 : సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల పేరిట గారడి చేసి, ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా, మూసీనది సుందరీకరణ పేరిట ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కారు మండలానికో గురుకుల విద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నక్క మనోహర్, బీఆర్ఎస్ నాయకులు సలీం, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ



తాండూర్: మాదారంలో దుర్గామాత ఊరేగింపు



రెబ్బెన : ఇందిరానగర్ లో అమ్మవారి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు



లక్షెట్టిపేట : దుర్గామాత శోభాయాత్రలో కమిటీ సభ్యులు

# సల్లంగ సూడు దుర్గమ్మ తల్లీ..

- ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు
- కనుల పండువగా శోభాయాత్రలు
- ఆకట్టుకున్న నృత్యాలు.. కోలాటాల సందడి

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం దుర్గామాత నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాడ వాడలా తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగించారు. యువత డీజే సౌండ్స్‌కు అనుగుణంగా నృత్యాలు చేస్తూ హోరెత్తించగా, మహిళలు కోలాటాలతో సందడి చేశారు. భక్తులు మంగళహారతులతో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు. సల్లంగ సూడు తల్లీ.. అంటూ వేడుకున్నారు. ఆపై పట్టణాలు, గ్రామాల సమీపంలోని వాగులు, చెరువుల్లో అమ్మవారి ప్రతిమలను నిమజ్జనం చేశారు.

- నమస్తే బృందం

చెన్నూర్ టౌన్ : దుర్గాదేవి శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు

